సాక్షి
తిరుపతి

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



ఆలయ పనుల పరిశీలన

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న పనులను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు.

- 8లో



రెడ్‌క్రాస్ వాహనం ప్రారంభం

రెడ్‌క్రాస్‌కు విరాళంగా అందించిన వాహనాన్ని మంగళవారం కలెక్టర్ జీ.లక్ష్మీశ ప్రారంభించారు.

- 8లో



ఇది దేవుడి 'కరుణ'!

శ్రీవారే టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పంపి తమ సమస్యలు పరిష్కరించారని టీటీడీ అటవీ కార్మికులు కొనియాడారు.

- 8లో

న్యూస్‌రీల్

ఓటు వినియోగంపై అవగాహన



తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో డెమో సెంటర్

తిరుపతి అర్బన్: ఓటు వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతి కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో కార్యాలయాల్లోనూ ఓట్లు వినియోగంపై డెమోను నిర్వహిస్తున్నారు. ఓటు బటన్ ఏలా నొక్కాలి.. వేసిన ఓటు ఏగుర్తుకు పడిదిందో తెలుసుకోవాలంటే చూడాల్సి విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని 34 మండలాలకు సంబంధించి ఈ ఏడాది జనవరి 22 నాటికి 17,79,058 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాను గతంలో విడుదల చేశారు. అందులో మహిళలు 9,10,597 మంది, పురుషులు 8,68,273 మంది, ట్రాన్స్‌జెండర్లు 188 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరంతా వందశాతం ఓటు వినియోగంచుకోవాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సూచించారు.

ఉత్తీర్ణత శాతం పెంచడానికి కృషి



భాస్కర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్: హాస్టళ్లలో ఉన్న పదోతరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడానికి కృషి చేయనున్నట్టు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 40 బీసీ వెల్ఫేర్ హాస్టల్స్‌లో 570 మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. గత ఏడాది 79 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది దాన్ని 90 శాతానికి మించేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్, హిందీ సబ్జెక్ట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి 120 మంది ట్యూటర్స్‌ను నియమించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 40 హాస్టల్స్‌లో 5,490 మంది పిల్లలున్నారని ఆయన వివరించారు.

నేడు ఉచిత అక్షరాభ్యాసం

తిరుపతి కల్చరల్: చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వసంత పంచమీని పురస్కరించుకొని ఆర్ఎస్ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో బుధవారం ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కే.శేషగిరిరావు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మూడేళ్లు నిండిన పిల్లలకు అర్చక పండితులచేత శాస్త్రోక్తంగా అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టనున్నట్టు వెల్లడించారు. అలాగే టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షల్లో విజయం చేకూరాలనే సంకల్పంతో బాసరలోని సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కంకణాలను సైతం వారికి అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు 9985532447, 6301192026ను సంప్రదించాలని వారు సూచించారు.

ఎంఈఓల నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘం-2 ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మించల శంకరయ్య(పెళ్లకూరు మండలం), ప్రధాన కార్యదర్శిగా కటారి సతీష్‌బాబు (ఎర్రావారిపాళెం), కోశాధికారిగా గున్నయ్య (వరదయ్యపాళెం మండలం), జిల్లా గౌరవాధ్యక్షులుగా బాలయ్య (శ్రీకాళహస్తి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25శాతం ఉచిత ప్రవేశాలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి 2024-2025 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం 1వ తరగతిలో ప్రవేశాలను ఉచితంగా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న (అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు) వర్గాలకు 5 శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలు (బీసీ, మైనారిటీ, ఓసీ)కు 6 శాతం సీట్లు కేటాయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షల లోపు ఉండాలని చెప్పారు. ఆసక్తి, అర్హత గల తల్లిదండ్రులు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్లో ఈనెల 23నుంచి మార్చి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసేటప్పుడు సాంకేతిక సమస్యలు ఎదురైతే 14417 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబరులో సంప్రదించాలని డీఈఓ కోరారు.

పడవలో ప్రయాణం.. దీవి ప్రజలకు అభయం!



పులికాట్ సరస్సు మీదుగా పడవలో ఇరకం దీవికి వెళుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పడవలో ఇరకం దీవికి చేరుకుని అక్కడి ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. పేదలకు అందుతున్న సేవలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జాలర్ల ఇళ్ల సమస్య వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పిల్లలను బయటకు పంపకుండా స్థానికంగా ఉన్న బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులను ప్రాధేయపడ్డారు. ఆ మేరకు మంచి ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తామని స్థానికుల్లో ఉత్సాహాన్ని నింపారు.

- సూళ్లూరుపేట నియోజకవర్గంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- పడవలో ఇరకం దీవికి చేరుకుని అభివృద్ధి పనుల పరిశీలన
- 291, 292 పోలింగ్ స్టేషన్ల సందర్శన
- జాలర్లకు రోడ్డు వసతి ఉన్నచోటే ఇళ్ల స్థలాలు
- మంచి ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన
- జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశ

తడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పరిస్థితిని తెలుసుకునేందుకు నూతన కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం మండలంలోని ఇరకం దీవిని సందర్శించారు. గ్రామంలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పులికాట్ సరస్సు మీదుగా పడవ ద్వారా ఇరకం దీవికి చేరుకున్న కలెక్టర్ అనంతరం ట్రాక్టర్ మీద ప్రయాణం చేసి గ్రామానికి చేరుకున్నారు. అక్కడున్న గ్రామదేవత పొన్నియమ్మన్ అమ్మణిని దర్శించుకున్నారు. అనంతరం కాలినడకన ఇరకం గ్రామ ప్రాథమిక పాఠశాలలో 291 నంబర్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. పాత భవనం కావడంతో శిథిలావస్థలో ఉన్న కిటికీలను బాగు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బంది వివరాలు, మందుల లభ్యత, అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం ట్రాక్టర్‌లో ఇరకం జాలర్లు నివసించే పాళెంతోపు కుప్పానికి చేరుకున్నారు. అక్కడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 292వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. నాడు-నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో మరుగుదొడ్లు కూడా నిర్మించాలని సర్పంచ్‌కి సూచించారు. విద్యార్థులు బయటి ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మంచి ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారు. దానికి తల్లిదండ్రులు సహకరించి తమ పిల్లలను గ్రామంలోని పాఠశాలకు పంపాలని ప్రాధేయపడ్డారు. అనంతరం సర్పంచ్ భర్త గుణశేఖర్ గ్రామంలోని జాలర్లు తమ పిల్లల ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లలేక పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో పూడి గ్రామం వద్ద ఇళ్ల స్థలాలు సేకరించారని, అయితే పంపిణీ ఆలస్యమవుతోందని తెలపగా.. కలెక్టర్ స్పందించి రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారం రోజుల్లోగా దీనికి సంబంధించి అన్ని పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.



ఇరకం ప్రాథమిక ఉప కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్



ఇరకం గ్రామంలో ట్రాక్టర్ మీద ప్రయాణిస్తున్న కలెక్టర్

దీవిలో ప్రగతి పరుగులు

అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ దీవిలో పర్యటించి, ఇక్కడి పరిస్థితులు తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ గతంతో పోల్చితే వైద్యసేవలు చాలావరకు మెరుగుపడ్డాయని చెప్పారు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయని, ఇంకా మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామస్తులు సహకరించి తమ పిల్లలను పాఠశాలకు పంపితే సేవాదృక్పథంతో ఉన్న ఉపాధ్యాయులను ఇక్కడ నియమించి మంచి విద్య అందించేలా చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్ వెంట నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, తడ తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, సీఐ మధుబాబు, ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ మల్లికార్జున్, ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ ఉన్నారు.

విద్యతో జ్ఞాన వెలుగులు

- చక్కటి ప్రణాళికతో మెరుగైన జీవితం
- రాష్ట్రంలో విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక సంస్కరణలు
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడి
- 1,957 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్ తదితరాలు అందజేత



తుమ్మలగుంటలో విద్యాసామగ్రి అందుకున్న పిల్లలతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: అంధకారంతో కూడిన జీవితాల్లో క్రమశిక్షణతో కూడిన విద్య వల్ల జ్ఞాన వెలుగులు ప్రసరిస్తాయని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్ పరిధిలోని తుమ్మలగుంట, వేదాంతపురం, తిరుచానూరు, ముండ్లపూడి, పాడిపేట, కొత్తూరు, వేమూరు, బ్రాహ్మణపట్టు, మంగళం, రణధీరపురం, తిరుమలనగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో 1,957 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, బ్రెయిన్ ఎక్సర్ సైజ్ ఫజిల్ షీట్‌లు అందజేశారు. ఆయా పాఠశాలల్లో మోహిత్‌రెడ్డికి తల్లిదండ్రులు, స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా చదువులతల్లి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మలగుంట పాఠశాలలో ఆయన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ చక్కటి ప్రణాళికతో మెరుగైన జీవితానికి మార్గం సుగుమం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రతి పేదవాడికి విద్యను చేరువ చేసేందుకు అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక వంటి పథకాలను అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. సీఎం జగనన్న స్ఫూర్తితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ఏ సంపద అయినా, బంధుత్వాలైనా మన నుంచి దూరమవుతాయని, కానీ విద్యా సంపదను ఎవరూ దోచుకోలేరన్నారు. అలాంటి విద్యను ప్రతి ఒక్కరూ సముపార్జించాలని చెప్పారు. ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ వేముల యశోద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేదాంతపురం పంచాయతీలో విద్యా కానుక కిట్లు అందుకున్న విద్యార్థులు



బ్రాహ్మణపట్టులో విద్యాకానుక కిట్లు అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

ఆనం మాటలు..నీటిమీద రాతలు



వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- డక్కిలిలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం
- ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డిపై ధ్వజం
- పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన రామ్‌కుమార్‌రెడ్డి

డక్కిలి: స్థానిక ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డి మాటలు నీటిమీద రాతలేనని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం డక్కిలిలోని అటవీశాఖ అతిథి గృహంలో జరిగిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయకపోవడం వల్లే ఆయనను అధిష్టానం పక్కనబెట్టిందన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఏడాదిలోనే వెంకటగిరి నియోజకవర్గ రూపురేఖలు మార్చానని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే ఇంత చేస్తే.. ఐదేళ్లలో ఎంత చేయొచ్చో ప్రజలు ఆలోచించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పిస్తోందని, అన్ని రంగాల్లో వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల కోసం ఇప్పటివరకు రూ.2.5 లక్షల కోట్లు ఖర్చుచేసిందని తెలిపారు. ఒక్కో నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఒక్కో సచివాలయానికి రూ.50 లక్షలు

తాను నియోజవర్గంలో 76 వేల గడపలు తొక్కానని, సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూశానని రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల సీఎం వెంకటగిరికి వచ్చినప్పుడు నియోజకవర్గంలోని 107 సచివాలయాలకుగాను ఒక్కో సచివాలయానికి రూ.50 లక్షల చొప్పున రూ.50 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారని, దీనివల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం మరింత పెరిగిందన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు నిలిపివేసిన ఘనత ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డికే దక్కిందన్నారు. రైతులకు తెలుగుగంగ నీటిని విడుదల చేయాలని తాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా వెంటనే ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని గుర్తుచేశారు. అనంతరం అన్నీ గ్రామ పంచాయతీల వారీగా నాయకులతో సమీక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ.జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సీహెచ్.శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ జీ. రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్.శంకర్‌రెడ్డి, పీ.దశరథరామిరెడ్డి, డీ.రవీంద్రారెడ్డి, ఎం.నారాయణరెడ్డి, ఏ.మల్లికార్జున్‌రెడ్డి, వేణునాయుడు, బీ.కృష్ణ, వీ.చెంచయ్య, జీ.శ్రీనివాసులు నాయుడు, ప్రకాష్ నాయుడు, బీ.భాస్కర్ నాయుడు, చిరంజీవి, డీపీ యాదవ్, ఎస్.రమణారెడ్డి, వేములమల్లి, కోళ్లపూడి వేణుగోపాల్, డీ.పెంచలరెడ్డి, బండి రమేష్‌రెడ్డి, రాజమోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 69,314 మంది స్వామివారిని దర్శించుకోగా 25,165 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పూత ఆలస్యంపై ఆందోళన వద్దు

భాకరాపేట: మామిడి పూత ఆలస్యంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన చిన్నగొట్టిగల్లు మండలంలోని కలెక్షన్ సెంటర్‌ను పర్యవేక్షించారు. అలాగే చట్టేవారిపాళెం, చిట్టేచెర్ల పంచాయతీల పరిధిలోని మామిడి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమవుతోందన్నారు. కానీ అక్కడక్కడా తోటల్లో పూత దశ ఉందని, ఈ దశలో తేనేమంచు పురుగు, అంత్రక్నోస్ మచ్చ తెగులు సోకుతోందని తెలిపారు. రైతులు వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారిణి శివకుమారి, వెలుగు ఏపీఎం కుమార్, ఆర్‌బీకే ఇన్‌చార్జీలు రాహుల్, కిశోర్, వనిత, వెంకటేశ్వరి, ఆంజనేయలు పాల్గొన్నారు.



మామిడి పూతను పరిశీలిస్తున్న అధికారులు

పలువురు డీఎస్పీలకు స్థాన చలనం

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆళ్లగడ్డలో ఉన్న ఎన్.సుధాకర్ రెడ్డిని ఏసీబీకు అటాచ్ చేస్తూ చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు, తిరుమల ట్రాఫిక్‌లో పనిచేస్తున్న డీపీ కొండయ్యను కర్నూలు ఎస్సీ ఎస్టీ విభాగానికి, పోలవరంలో పనిచేస్తున్న జీవీఎస్.పైడేశ్వర రావును శ్రీసిటీకి, శ్రీసిటీలో పనిచేస్తున్న జగదీష్ నాయక్‌ను బాపట్ల క్రైమ్ విభాగానికి, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న యు.నరసింగప్పను తిరుపతి ఎస్సీ, ఎస్టీ విభాగానికి, తిరుపతి క్రైమ్‌లో పనిచేస్తున్న ఎం.జనార్దన్‌ను ఎన్టీఆర్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ వాహనం ప్రారంభం

తిరుపతి అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీకి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద పుల్కిత్ టీఎంటీ బార్ కంపెనీ వారు స్పాన్సర్ చేసిన వ్యాన్‌ను జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశ. పుష్పిత్ స్టీల్ ఎండీ పుష్పిత్‌గార్గ్‌తో కలిసి కలెక్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా రక్త దాతల నుంచి రక్త సేకరణ సులువవుతుందని తెలిపారు. పుష్పిత్ స్టీల్ సీఈఓ. బలరామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్, కార్యదర్శి ప్రణీత్, ట్రెజరర్‌సుబ్బారావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


బాలాజీ (ఫైల్)

చంద్రగిరి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని తొండవాడ జగనన్న కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వకు చెందిన వరదారెడ్డి, కుమారుడు బాలాజీ(18)తో కలిసి పిచ్చినాయుడుపల్లి నుంచి జగనన్న కాలనీకి సన్న కంకరను ట్రాక్టర్‌లో లోడ్డు చేసుకుని బయల్దేరాడు. జగనన్న కాలనీ సమీంలో ట్రాక్టర్‌ను ఆపి వరదారెడ్డి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ముందుకు వెళ్లడంతో బాలాజీ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నుంచి కింద పడ్డాడు. అదే సమయంలో ట్రాలీ వెనుక చక్రాలు యువకుడిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ అనిత ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇది దేవుడి 'కరుణ'!

- టీటీడీ అటవీ కార్మికుల నిరీక్షణకు తెర
- అడిగిన దానికన్నా మించి వేతనాలు
- టీటీడీ చైర్మన్ భూమనకు ఆత్మీయ సత్కారం


అటవీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: 'కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యాయి. 38 నెలల నిరీక్షణకు మంచి ఫలితమే లభించింది. ఆ కలియుగ వేంకటేశ్వరుడే టీటీడీ చైర్మన్ భూమన్ కరుణాకరరెడ్డి రూపంలో పంపారు. మేము అడిగిన దానికన్నా మరింత ఎక్కువగా వేతనాలు అందించి అండగా నిలిచారు'..అని టీటీడీ అటవీ కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నివాసంలో ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కరించినందుకు టీటీడీ చైర్మన్‌ను కార్మికులు ఆత్మీయంగా సత్కరించారు. అలాగే సీపీఎం నాయకులు కందారపు మురళి, నాగరాజును దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నేను ఎర్రజెండా నీడన పెరిగిన వాడినే

అనంతరం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తాను పేదల మేలుకోరి ఎర్రజెండా నీడన పెరిగానని తెలిపారు. కార్మిక, ఉద్యోగులందరూ సంతోషంగా ఉండాలని, బలహీనులకు న్యాయం జరగాలనే తాను టీటీడీలోని కాంట్రాక్ట్, కార్పొరేషన్, సొసైటీల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి అండగా నిలిచానని చెప్పారు. కమ్యూనిస్టులతో తనకు భావ స్వారూప్యం ఉన్నందు వల్లే కొన్ని అంశాల్లో వారితో కలసి పని చేస్తున్నామన్నారు. ఈ మాత్రానికే వారి మీద బురద చల్లడం మంచిది కాదన్నారు. తన దృష్టికి వచ్చిన టీటీడీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గోశాల కార్మికులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలపై చర్చించి వీలైనంత వరకు సమస్యలు పరిష్కారిస్తామన్నారు.

ఇలాంటి రాతలకు భయపడం

సీపీఎం నాయకుడు కందారపు మురళి మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్ అయ్యాకే ఉద్యోగ, కార్మిక సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయని కొనియాడారు. ఇక పరిష్కారం కావనుకున్న సమయంలో టీటీడీ చైర్మన్, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి చొరవ వల్ల అటవీకార్మికుల సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. పారిశుద్ధ్య, పోటు కార్మికులు, కల్యాణకట్ట క్షురకులు ఇలా అనేక మంది తరఫున తాము పోరాటాలు చేస్తే తాము అధికార పక్షం అని కొన్ని పత్రికల్లో ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అలాంటి వాటికి తాము భయపడమని ఆయన స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, టీటీడీలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు


దక్కిలి: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇందులో సైదాపురం మండలం, కృష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 20 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. మర్లపూడి ఎంపీటీసీ సభ్యుడు, కృష్ణారెడ్డిపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, అంకయ్యతో కలిసి దక్కిలిలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునరుద్ధరణ పనులను టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆలయ పనుల పరిశీలనకు విచ్చేసిన ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణలో భాగంగా చేపడుతున్న పనులలో నాణ్యత కొరవకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చూడాలన్నారు. వీలైనంత త్వరగా ఆలయ పనులను పూర్తిచేయాలని చెప్పారు. టీటీడీ చైర్మన్ వెంట మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అతిథిసింగ్, ఆలయ చైర్మన్ కట్టాగోపీ యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, తులసీయాదవ్, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి ఉన్నారు.

'వైఎస్సార్‌సీపీకి' ముంగిలి'పట్టు'


ముంగిళిపట్టు టీడీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- చెవిరెడ్డి అభివృద్ధికి అండగా నిలిచిన 20 టీడీపీ కుటుంబాలు
- కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో దశబ్దాల తరబడి టీడీపీకి కంచుకోటగా ఉన్న పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ పట్టుబిగిస్తోంది. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు నియోజకవర్గ వ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. టీడీపీ కంచుకోటలు సైతం బద్దలవుతున్నాయి. తాజాగా చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లి పంచాయతీ, ముంగిలిపట్టుకు చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంగళవారం తుమ్మలగుంటలోని నివాసం వద్ద తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవ, చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్‌జాయింట్ సెక్రటరీ యశ్వంత్‌చౌదరి ఆధ్వర్యంలో చేరిన వారిలో కే.నారాయణస్వామి, టీ.మురళి, కే.సురేష్, టీ.సీమాన్, కే.గణేష్, డీ.రాజేంద్ర, పేదర్, ఐ.రాజేష్, కే.మాధవి, టీ.పరిమళ, జీ.రేణుక, టీ.తంగమని, కే.లక్ష్మీదేవి, ఐ.మాధవి, కే.రెడ్డెమ్మ, పీ.సరస్వతి తదితరులు ఉన్నారు. పార్టీ పంచాయతీ అధ్యక్షులు బాబునాయుడు, సుధాకర్, చక్రవర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


తిరుపతి ఎస్పీ మల్లికా గార్గే

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం ఏపీ మాజీ సీఎస్ఎల్వీ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ స్పీకర్ కొల్లు వీరభద్రస్వామి, తిరుపతి నూతన ఎస్పీ మల్లికాగార్గే, ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ.నాగార్జున రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో లైట్లు అమర్చాలని, సీసీ కెమెరాలు అమర్చాలని చెప్పారు. రవాణాశాఖ, పోలీసు శాఖ రోడ్డు ప్రమాదాలు జరగకుండా అనుక్షణం నిఘా ఉంచాలన్నారు. జిల్లా రవాణా శాఖాధికారి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ కమిటీ మెంబర్ ఎం.సునీల్‌చక్రవర్తి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, డీఎంహెచ్‌ఓ ఎం.శ్రీహరి పాల్గొన్నారు.

ఘన వీడ్కోలు



ఆచార్య చక్రవర్తి రంగనాథన్‌ను సన్మానిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహితీ విభాగం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి రంగనాథన్ మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. వర్సిటీ అధికారులు మాట్లాడుతూ రంగనాథ్ హయాంలో వర్సిటీకి నాక్ కమిటీ రావడం అభినందనీయమన్నారు. వర్సిటీ అధ్యాపకులు, డీన్‌లు హాజరయ్యారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుపతి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వకుళామాత గుడి వద్ద చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ షేక్షావలి కథనం.. చెన్నై రామలింగనగర్‌కు చెందిన అరుణ్‌కాంత్ (38) ద్విచక్ర వాహనంపై మంగళవారం తెల్లవారుజామున తిరుపతికి వస్తున్నాడు. వకుళామాత గుడి సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

వీసీకి ఖాట్మండు ఆహ్వానం


మహిళా వర్సిటీ వీసీ భారతి

తిరుపతి సిటీ: పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ డీ భారతికి నేపాల్‌లోని ఖాట్మండ్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు మంగళవారం ఆమె నేపాల్ బయలుదేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య అంతర్జాతీయకరణలో భాగంగా ఇతర దేశాలలోని వర్సిటీలతో రీసెర్చ్ కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్, జాయింట్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు, విదేశీ విద్యార్థులు భారత్‌లో చదివేలా ప్రోత్సహించడం వంటి వాటిపై ఖాట్మండ్ యూనివర్సిటీలో జరిగే సమ్మిట్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. భారత్, నేపాల్‌లోని సుమారు 150 యూనివర్సిటీల నుంచి వీసీ, ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారని ఆమె తెలియజేశారు.

ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం

తిరుపతి అర్బన్: ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి నోడల్ అధికారి నడుచుకోవాలని చెప్పారు. డీఆర్‌ఓ పెంచల్ కిషోర్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

తిరుపతి ఎడ్యుకేషన్: సహిత విద్య ఉపాధ్యాయులు, భవిత టీచర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ సూచించారు. తిరుపతిలోని ఎంఎంబీజీ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఒక్క రోజు ఇన్ సర్వీస్ ట్యాబ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సహిత విద్యావిభాగంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యాప్‌లను ఉపయోగించే విధానాలను వారికి నేర్పాలని సూచించారు. సహిత విద్య కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రిసోర్స్ పర్సన్లు బీఎస్.నాయుడు, పీ.సునీల్, రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ వై.నరసింహం, రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ ఎస్.అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చ పగటి వేషగాళ్లను నమ్మొద్దు


ఆసరా కార్యక్రమానికి హాజరైన పొదుపు సంఘాల మహిళలు


మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్

- మాయమాటలతో మభ్యపెట్టడమే బాబు నైజం
- ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు సిద్ధం
- ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ధ్వజం

వాకాడు: 'ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోకి పచ్చ పగటి వేషగాళ్లు వస్తున్నారు.. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు.. వారి మోసపూరిత మాటలు నమ్మొద్దు' అని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ విమర్శించారు. అధికార దాహంతో తనను నమ్మిన ప్రజలను, కుటుంబ సభ్యులను వంచించి మోసం చేయడమే చంద్రబాబు నైజమని ఆయన విరుచుకుపడ్డారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన వాకాడు మండల పొదుపు సంఘాల మహిళల నాలుగో విడత ఆసరా వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధే రెండు కళ్లుగా దూసుకుపోతున్నట్టు తెలిపారు. జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తున్నట్టు వెల్లడించారు. మండలంలో 6,068 స్వయం సహాయక సంఘాలకు గాను నాలుగో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.4.15 కోట్లు మహిళల ఖాతాలో జమచేసినట్టు వెల్లడించారు. అనంతరం పొదుపు మహిళలతో కలిసి జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆసరా మెగా చెక్కును ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఇరిగేషన్ అతిథి గృహంలో నాయకులు, కార్యకర్తలతో సాగునీటి సమస్యపై సమావేశమై చర్చించారు. ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నాయకులు అజిత్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి, రవిరెడ్డి, ఎంపీడీఓ గోపీనాథ్, ఏపీఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.


